# కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి





**దశ ఓయూ:** కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం త్వరలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో కుమ్మరి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరుల అభివృద్ధి కోసం పలు అంశాలపై చర్చించారు. తమ సమస్యల పరిష్కారం కోసం భవిషత్తు కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం అధ్యక్షుడు జయంత్ రావు, ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో మట్టి పాత్రల ఉత్పత్తి కోసం ప్రభుత్వం జీవోలు అమలు చేయాలన్నారు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పూర్తి పాలక వర్గంతో 200 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మరులకు వృత్తి శిక్షణ కేంద్రాలు 33 జిల్లాల్లో ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన కుమ్మర వృత్తిదారులకు 5000/ పెన్షను ఇవ్వాలన్నారు. కుమ్మరలను ను బీసీ బి నుండి బీసీ ఏ కి మార్చాలని, అంతేకాకుండా కుమ్మరుల ఆత్మ గౌరవ భవనానికి 5 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవయిత్రి మొల్ల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం, డా. కంభంపాటి సత్యనారాయణ, మంచి రాజలింగం, బండారి భిక్షపతి, కే.లక్ష్మీ నారాయణ, టీకే శ్రీనివాస్, చందర్ రావు, వీరేశం, రామచందర్, నాగపురి నాగేష్, శ్యాం కుమార్, ఏరుకొండ శ్రీనివాస్, రాచకొండ కృష్ణయ్య, గుండాల గోవర్ధన్, జిల్లల శంకర్, సాయిలు, అశోక్, నాంపల్లి శ్రీనివాస్,మల్లెల ఉషారాణి,ఎగిరిశెట్టి వీరయ్య, నిమ్మలురీ శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కట్నం వేధింపులు

❖ భర్త, అత్తమామలపై కేసు



**దశ, గోపాల్ పేట :** గోపాల్‌పేట మండలంలో అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం..చాకలిపల్లి గ్రామానికి చెందిన కొత్తకోట స్వాతి (25)కు 2024 డిసెంబర్‌లో ముత్సిలంపల్లి గ్రామానికి చెందిన కొత్త చరణ్‌రెడ్డితో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో స్వాతి కుటుంబ సభ్యులు రూ.30 లక్షల నగదు, సుమారు 50 తులాల బంగారాన్ని కట్నంగా ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాహం జరిగిన 16 రోజులకే భర్త విదేశాలకు వెళ్లిపోయాడని, అప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధింపులు ప్రారంభమయ్యాయని బాధితురాలు ఆరోపించింది. విదేశాలకు తనను తీసుకెళ్లాలంటే మరిన్ని నగదు, బంగారం తీసుకురావాలని, లేని పక్షంలో విడాకులు ఇస్తామని భర్త చరణ్‌రెడ్డితో పాటు అత్తమామలు మన్నూర్‌రెడ్డి, హేమలత బెదిరించినట్లు తెలిపింది.

అంతేకాకుండా, తన జీతాన్ని పూర్తిగా వినియోగించుకుంటూ పుట్టింటి నుంచి మరిన్ని డబ్బులు తీసుకురావాలని ఒత్తిడి తెచ్చారని, ఈ క్రమంలో మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గోపాల్‌పేట పోలీసులు భర్త, అత్తమామలు మరియు ఇతర కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. కట్నం డిమాండ్ చేయడం, వివాహితను వేధించడం చట్టవిరుద్ధమని ఏఎస్ఐ రమామణి తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోందని, నిందితులపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. మహిళలపై కట్న వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయండి

❖ రిటైర్డ్ హెచ్‌ఎం వేడుకోలు

**దశ ఖమ్మం :** ప్రభుత్వం నుంచి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల కాకపోవడంతో తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స పొందలేక ఇబ్బందులు పడుతున్నానని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెరుకుపల్లి వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట జెడ్పీ జీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఏడాది క్రితం పదవీ విరమణ పొందినట్లు తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.60 లక్షల బెనిఫిట్స్ ఇప్పటికీ అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని చెప్పారు.తన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారిందని, గుండెకు రక్తప్రసరణ సక్రమంగా లేక రెండు స్టెంట్లు వేయించుకున్నానని తెలిపారు. అలాగే ప్యాంక్రియాస్ క్యాన్సర్‌తో పాటు మరికొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారని వెల్లడించారు. ఇప్పటివరకు తన వద్ద ఉన్న సొమ్ముతో చికిత్స చేయించుకున్నానని, ప్రస్తుతం పూర్తి స్థాయి చికిత్సకు దాదాపు రూ.10 లక్షలు అవసరమని వైద్యులు సూచించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, ఖమ్మంలోని పలు ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించినప్పటికీ చికిత్స కొనసాగించేందుకు నిధుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి గురుప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మాదుపల్లి బాబు, అల్లంకి జయపాల్, జిల్లా గౌరవ అధ్యక్షుడు తెల్లపూట జమాలయ్య, మేళ్లచెరువు బాబు, కోటపింజర రాము, చెరుకుపల్లి మురళి, దూరి జయరాజు, తెల్లూరి యాదగిరి, మన్నె గురుమూర్తి, కోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రిలో భక్తులతో రద్దీ

**దశ యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిలాడింది. ఆదివారం సెలవు దినంతోపాటు వరుస సెలవులు రావడంతో నారసింహుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో తిరుమాడవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మదర్శనానికి 3 గంటలు, వీవీ ఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం నిర్వహించారు.స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ఉత్సవ మూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. శ్రీలక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు



గంటన్నరకు పైగా నిత్యతిరు కల్యాణ తంతును జరిపారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారు జామునే ఆలయ తలుపులు తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి వారి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు . ఆలయ ఎస్ వి ఎఫ్ ఆర్ ఐ శేషగిరిరావు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, కనకయ్య తిరుపతి సిద్దు ఆలయ సిబ్బంది ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పాతికేళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



**దశ, కామారెడ్డి :** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 20002001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాతికేళ్ల తర్వాత ఒకేచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆదివారం నిర్వహించిన ఈ ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాఠశాల రోజుల్లో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను స్మరించుకుంటూ, అప్పటి తరగతి గది అనుభవాలు, చేసిన చిన్న చిన్న అల్లరులు, ఆటపాటలు, నవ్వులు గుర్తుచేసుకుని కేరింతలు కొట్టారు. పాఠశాల జీవితం తమ జీవితాల్లో వేసిన ముద్రను స్మరించుకున్నారు. ప్రస్తుతం తాము చేస్తున్న వృత్తులు, కుటుంబ పరిస్థితులు, జీవితంలో ఎదుర్కొన్న కష్టసుఖాలను పరస్పరం పంచుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో తరచూ కలుసుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగడమే కాకుండా సమాజ సేవలోనూ భాగస్వామ్యం కావాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, రామకృష్ణారావు, సంతోష్, పద్మ, స్రవంతి, పద్మజ, స్వరూపతో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షం ధాటికి తడిసిన వరి ధాన్యం

❖ కలెక్టర్ ఆదేశించినా.. కదలని ధాన్యం బస్తాలు..

❖ పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



**దశ, తాండూరు :** వర్షం ధాటికి తడిసిన వరి వర్షానికి వరి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో అన్నదాతలు ఈ తడిసిన ధాన్యాన్ని ఎలా అమ్ముకోవాలంటూ ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో కురిసిన వర్షంధాటికి వడ్లధాన్యం అడుగు భాగానికి వర్షంనీరు చేరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి.వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం లోని యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, తాండూరు మండలాల్లోని పలు సెంటర్లలో వరి ధాన్యం ఉంది.బెన్నూర్, జంటుపల్లి సెంటర్లలో ఉన్న వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది. జిల్లా కలెక్టర్ ఆదేశించిన కూడా సెంటర్లలో వరి ధాన్యం బస్తాలు కదలడం లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోవడంలేదని రైతులు మండిపడ్డారు.తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# ఓయూ లో "ఊపిరి వంతెన" పుస్తకాన్ని ఆవిష్కరించిన వీ.సీ. ప్రొఫెసర్ ఎం కుమార్

**దశ ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో పెండ్యాల ఆంజనేయులు రచించిన కవితా సంపుటి " ఊపిరి వంతెన " అనే పుస్తకాన్ని ఆర్ట్స్ కళాశాలలో శనివారం ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సమాజానికి స్ఫూర్తి నింపే విధంగా "ఊపిరి వంతెన" ద్వారా ఆంజనేయులు కవిత్వం ఉందని పేర్కొన్నారు.

ఈ కవిత్వము ముందు తరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ యూనివర్సిటీలో చిన్న ఉద్యోగిగా పని చేస్తూనే సామాజిక బాధ్యతతో సామాజిక స్పృహ కలిగించే విధంగా ఆంజనేయులు కవితలు ఉన్నాయని ప్రశంసించారు.

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన ఆంజనేయులు తన తండ్రి ఆస్తులను కాకుండా ఆశయాలను పంచుకొని కవిత్వాన్ని సమాజానికి అందించారని చెప్పారు. ఓయూ ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ లింగప్ప గోనాల్ మాట్లాడుతూ సామాజిక అంశాలను తన కవిత్వంగా ఎంచుకొని పుస్తకం తీసుకువచ్చినందుకు ఆంజనేయులు ను అభినందించారు. ఓయూ తెలుగు శాఖ పాఠ్య



ప్రణాళిక సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎస్ రఘు "ఊపిరి వంతెన" పుస్తకాన్ని సమీక్షించారు. తన 103 కవితల ద్వారా తన జీవిత సారంతో పాటు సమాజంలోని అనేక అంశాలను ఆంజనేయులు ప్రతిబింబించారని పేర్కొన్నారు. "ఊపిరి వంతెన " పుస్తక కవి పెండ్యాల ఆంజనేయులు మాట్లాడుతూ జీవిత అనుభవం, మానవతా విలువలే తన గురువులని పేర్కొంటూ అక్షరం నా ఊపిరి ఉస్మానియా నా జీవనాడి అని వివరించారు. తన కవిత్వంలో సహకరించిన ప్రొఫెసర్ బాగయ్య, డాక్టర్ కే బాలకృష్ణ, దండి గౌరీ శంకర్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. స్వాతి, ఓయూ తెలుగు శాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ విజయలక్ష్మి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, కుటుంబ సభ్యులు భార్య సక్కుబాయి, కుటుంబ సభ్యులు శివ కుమార్, నవనీత, వాణి, వేణుగోపాల్, దక్షిత, శబరి నాథ్, వేదాక్షి, విధాత్రి తదితరులు పాల్గొన్నారు.

03

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..

సోమవారం
18-05-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాలేరు | మధిర
భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట

WWW.DASHANEWS.COM




## రేపు, ఎల్లుండిలోగా BLA2 ఫామ్‌లు RDO ఆఫీస్, ఎలక్షన్ DTకి అందజేయాలి

**దశ, మణుగూరు:** SIR (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం అన్ని నియోజకవర్గాలలో ప్రారంభమైనది కనుక, BLA2 (బూతు లెవెల్ ఏజెంట్) ఫామ్ లు రేపు, ఎల్లుండిలోగా RDO ఆఫీస్ మరియు మండల ఆఫీసులోని ఎలక్షన్ DT గారికి అప్ప చెప్పవలసిందిగా పినపాక మాజీ MLA రేగా కాంతారావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ BLA2 (బూతు లెవెల్ ఏజెంట్) ఫామ్ లు మీరు గాని నిర్ణీత సమయంలోగా అప్పచెప్పకపోతే తరువాత మన పార్టీ వారి ఓట్లను తొలగించినా గానీ.. అడిగే అధికారం మనకు ఉండదన్నారు. కావున మండల అధ్యక్షులు త్వరితగతిన ఈ యొక్క BLA2 (బూతు లెవెల్ ఏజెంట్) ఫామ్ లు RDO మరియు ఎలక్షన్ DT గారికి సమర్పించేలా చొరవ తీసుకోవాల్సిందే కోరారు.

## నేడు 2కె రన్‌లో యువత స్వచ్ఛందంగా పాల్గొనాలి

❖ *ఏడూళ్లబయ్యారం బయ్యారం SI సురేష్*



**దశ, పినపాక:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేపు అనగా సోమవారం ఉదయం 6 గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు ఈ బయ్యారం ఎస్సై సురేష్ తెలిపారు. పినపాక ఎంపీడీవో కార్యాలయం నుండి ఈ బయ్యారం క్రాస్ రోడ్డు వరకు ఈ రన్ కొనసాగుతుందని చెప్పారు. యువత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


## భక్తి శ్రద్ధలతో గోదారమ్మకు నదీ హారతి



**దశ, భద్రాచలం :** భక్తుల కోలాహలం, భక్తి పారవశ్యం నడుమ భద్రాచలంలో గోదారమ్మకు ఆదివారం నదీ హారతి అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. శ్రీ సీతారామచంద్ర స్వామి దివ్యక్షేత్రం భద్రాచలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా పురోహితులు గోదావరి నదీహారతి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం గణపతి పూజ నిర్వహించి, "జై శ్రీరామ్" అలంకారంతో 108 ప్రమిదలతో దీపోత్సవాన్ని భక్తుల చేత వెలిగించారు. పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. పురోహితులు శ్రీరామ అష్టోత్తర శతనామావళి పఠిస్తుండగా, భక్తులు "ఓం శ్రీరామాయ నమః" అంటూ 108 సార్లు శ్రీరామ నామస్మరణ చేశారు. చఅనంతరం ముందుగా శ్రీ సీతారామచంద్ర స్వామివారికి 12 సార్లు హారతి సమర్పించి, తర్వాత గోదావరి నదికి 21 సార్లు నదీ హారతి ఇచ్చారు. కార్యక్రమం ముగింపులో శాంతి మంత్ర పఠనం జరిపి, రవికుమార్ శర్మ-లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సత్యప్రసాద్ శర్మ, కృష్ణమాచార్య, కాదంబరి కృష్ణశర్మ, రామాచార్యులు, కంజర్ల సుబ్రహ్మణ్యం, తేజశర్మ, వీరభద్రశర్మతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, భద్రాద్రి కా మహారాజు ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# BRS పార్టీ సభ్యత్వంపై దృష్టి సారించండి

❖ *సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర*



**దశ, సత్తుపల్లి :** BRS పార్టీ సభ్యత్వంపై ప్రతి కార్యకర్త దృష్టి పెట్టాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల ముఖ్య నాయకుల సమావేశం అదివారం DNP ఫంక్షన్ హాల్ నందు ఆదివారం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ నమోదు కార్యక్రమం త్వరలో జరుగుతుందని గ్రామస్థాయి నాయకులతో కలిసి ప్రతి గ్రామంలో బిఎల్ఓ లు దగ్గర ఉన్నటువంటి ఓటర్ల జాబితా పరిశీలించి ఓటర్లు మార్పులు చేర్పులు విధానంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో హడావుడిగా కాకుండా ఇప్పటినుండి ఓటు అనేది చాలా ప్రాముఖ్యత ఉన్నది ఆ ఓటును పూర్తిస్థాయిలో వినియోగించేందుకు డబల్ ఓట్లు పేరున కొన్ని ఓట్లు తొలగించడం జరుగుతుందని ఎక్కడైనా రాష్ట్రంలో ఒకచోట మాత్రమే ఓటు వినియోగం ఖచ్చితంగా ఉండేలా చూడాలన్నారు ప్రతి కార్యకర్త ప్రతి గ్రామంలో అందుబాటులో ఉండి ఓటర్ల జాబితా పరిశీలించి మార్పులు చేర్పులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**సభ్యత్వ నమోదుపై దృష్టి సారించండి**

గత మాదిరిగా కాకుండా ఈసారి బిఆర్ఎస్ పార్టీ సభ్యత నమోదు మొత్తం ఆన్లైన్లోనే పొందపరచడం జరుగుతుందని ప్రతి బూతు లో ఇద్దరు స్మార్ట్ ఫోన్ కలిగిన యువకులను ఎంపిక చేసి ప్రతి ఇంటికి తిరుగుతూ ఫోటోతో సహా సభ్యత్వం ఆన్లైన్ చేయాలని ఈ ప్రక్రియపై ప్రతి నాయకుడు దృష్టి సారించాలన్నారు వెంటనే గ్రామాల్లోకి వెళ్లి గ్రామస్థాయి నాయకులు సహకారంతో ప్రతి బూత్ కు పార్టీకి చెందిన ఇద్దరు యువకులను ఎంపిక చేయాలని సూచించారు.

**రైతుల పట్ల వివక్ష చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం**

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ ఇబ్బందులు గురి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో దాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగానే కాటాలు వేసి మిల్లర్లకు పంపించి డబ్బులు వెంటనే రైతు ఖాతాలో జమ చేసిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు కానీ నేడు ఆ పరిస్థితి భిన్నంగా ఉంది అని లారీలు కొరత,హమాలీలు కొరత,గన్ని సంచులు కొరత,మిల్లర్లు ఇబ్బందులు, కుంట వడ్లకు 12 కేజీల కొత అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు రైతు అన్ని విధాల బాధలకు ఇబ్బంది పడుతూ వరి పొలాల్లో ఉండాల్సిన రైతులు రోడ్ల పైకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు, అయినా ఈ ప్రభుత్వానికి రైతుల బాధలు అర్థం కావడం లేదన్నారు ప్రతిపక్షంలో ఉన్న తను పార్టీ నాయకులతో కలిసి ఇప్పటికే తల్లాడ కల్లూరు పెనుబల్లి మండల కేంద్రాల్లో రైతుల తో ధర్నా చేయడం జరిగిందని, పార్టి నాయకులు అధికారులను కలవడం ధర్నాలు చేపట్టడమే కానీ కనీసం ప్రభుత్వంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు ఇప్పటికే 70 శాతం వడ్లు ప్రైవేటు వ్యాపారస్తులకు,అమ్ముకున్నారని కళ్ళల్లో ఉన్న 30% వడ్లు కొనే దిక్కు కూడా లేదని అన్నారు రైతు పరిస్థితి దయానీయనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు మరోపక్క నీట్ పేపర్ లీక్ చేస్తూ 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాట మాడుతుందని విద్యార్థులు నిరుద్యోగులు పరిస్థితి అగొమాచర్యంగా మారిందన్నారు ఇంత జరుగుతున్న కూడా పలు రాజకీయ పార్టీలు నాయకులు కేంద్ర ప్రభుత్వం పట్ల స్తబ్దత చూపుతున్నారని,అర్థం కావడం లేదన్నారు ప్రజా సమస్యలపై స్పందించి మాట్లాడిన వారిపై ఈ రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెట్టడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు.

## జాతీయ స్థాయి క్రీడాకారుడు యశ్వంత్‌కు నగదు బహుమతి



**దశ, పినపాక:** విద్యా వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మరియు క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పినపాక మండలం ఈ. బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అడపా యశ్వంత్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నందుకు ప్రశంసాపత్రంతో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. యశ్వంత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరం నాగయ్య, పాఠశాల పీడీ బి. వీరన్న, ఉపాధ్యాయులు అభినందించారు.



## విప్పల సింగారం గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల కోసం MLAకు వినతిపత్రం అందజేత

**దశ, మణుగూరు :** విప్పల సింగారం గ్రామపంచాయతీ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ గ్రామ సర్పంచ్ పాల్వంచ రాములు మరియు ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చి, గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ బ్యూటిషియన్ ట్రైనింగ్ కార్యక్రమం




**దశ, భద్రాచలం:** భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఉద్యోగ మార్గదర్శక మరియు నియామక విభాగం, మహిళా సాధికారత విభాగం ఐటీసీ ఎంఎస్‌కే ప్రథమ్ వృత్తి శిక్షణ అసిస్టెంట్ బ్యూటిషియన్ ట్రైనింగ్ వాలెడిక్టరీ ఆధ్వర్యంలో నిర్వహించిన 250 గంటల సహాయ సౌందర్య నిపుణుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది. ఫిబ్రవరి మరియు మార్చి 2026 నెలల్లో కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న బాలికల కోసం నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ముగింపు సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. జాన్ మిల్టన్, ఐటీసీ మేనేజర్ డి. చెంగల్ రావు, భద్రాచలానికి చెందిన భగవాన్ స్వీట్స్ ప్రతినిధి శంకర్ రావు, సౌందర్య శిక్షణ కేంద్రం అధిపతి అనూష శిక్షణ పొందిన విద్యార్థినులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యోగ మార్గదర్శక మరియు నియామక విభాగం, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డాక్టర్ వి. రాఘు సుమ ఆధ్వర్యంలో ఐటీసీ ఎంఎస్‌కే ప్రథమ్ వృత్తి శిక్షణ కేంద్రం సహకారంతో నిర్వహించారు. విద్యా సమన్వయకర్త హవిలా, శ్రీమతి హిమజ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

❖ *భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** మే 18 సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లో ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో కూడా ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

